





ఫొటో అన్నది ప్రతిబింబం కాదు. దృశ్య రూపంలో చెప్పే కవిత్వం. కాలానికి సాక్ష్యంగా మిగిలే చరిత్ర. ఒక తాత్విక కళ. మాయాదీపం. అందాన్నీ, అందంలోని బీభత్సాన్నీ, ఆనందంలోని విషాదాన్నీ కూడా ఏకకాలంలో పటంగట్టి చూపిస్తారు ఫొటోగ్రాఫర్లు. అందుకు నిదర్శనమే ఈ ఫొటోలు. తిరుపతి నగరంలో, తిరుమల కొండ మీద, చిత్తూరు పల్లెల్లో ఆదివారం ఉదయం నుంచీ సాయంత్రం దాకా ఆంధ్రజ్యోతి కెమెరా కంటబడ్డ బతుకు చిత్రాలు ఇవి. మనసుపెట్టి చూస్తే ఎన్నో కథలు చెబుతాయి. మనల్ని కదిలిస్తాయి. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తిరుపతి, చిత్తూరు, తిరుమలలోని ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్లు వీటిని అందిస్తున్నారు.

నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ డే

జీవన చిత్రం





































అధికారం మారినా వైసీపీదే దందా

ప్రభుత్వం మారినా కుప్పంలో వైసీపీదే హవా నడుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారం చెలాయించిన నేతలే, ఇప్పుడు కూడా దందా నడుపుతున్నారు. గ్రానైట్ క్వారీలనుంచే కాదు, జల్లి క్వారీలనుంచీ లోడ్లకు లోడ్లు సరిహద్దులు దాటించేస్తున్నారు. అడ్డుకోబోయిన గ్రామస్థులకు అధికార టీడీపీలోని కొంతమంది ప్రముఖుల పేర్లు చెప్పి బెదిరిస్తున్నారు. ఇటువంటి తాజా సంఘటన ఆదివారం కుప్పం మండలంలో చోటు చేసుకుంది.

\- కుప్పం



తిమ్మాపురం సమీపంలోని జల్లి ఫ్యాక్టరీ

- మిట్టపల్లె జల్లి ఫ్యాక్టరీనుంచి అక్రమంగా లోడ్ల తరలింపు
- అడ్డుకున్న గ్రామస్థులకు ప్రముఖుల పేర్లు చెబుతున్న అక్రమార్కులు

కుప్పం మండలం మిట్టపల్లె పంచాయతీ తిమ్మాపురం సమీపంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జల్లి (గ్రావెల్) ఫ్యాక్టరీ నడిచేది. ఈ ఫ్యాక్టరీ వల్ల తిమ్మాపురం గ్రామంతోపాటు పరిసర గ్రామాలన్నీ కాలుష్యంతో నిండి, గాలి నీరు భూమి అన్నీ కలుషితమయ్యేవి. అప్పట్లో దౌర్జన్యంగా కొందరు వైసీపీ నేతలు ఈ ఫ్యాక్టరీని నడుపుతూ దందా చేసేవారు. ఇదేమని అడిగే గ్రామస్థులపై దౌర్జన్యం చేసేవారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక, జల్లి క్వారీ వల్ల తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులపై తిమ్మాపురంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫ్యాక్టరీనుంచి రేగే దుమ్మువల్ల గాలీ, నీరు, భూమి కూడా కలుషితమై వృద్ధులు, పిల్లలు అనారోగ్యంపాలవుతున్నారని, పంటలు కూడా పండడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా జల్లి ఫ్యాక్టరీ నడుస్తూనే ఉండడంతో జూలై నెల 9వ తేదీన గ్రామస్థులు పెద్ద యెత్తున ఫ్యాక్టరీ దగ్గరికి వెళ్లి, అక్కడున్న సిబ్బందిని తరిమేసి మూత వేశారు. జల్లి లోడ్లు రాకపోకలు సాగించే రహదారికి అడ్డంగా ట్రెంచ్ కొట్టారు. మళ్లీ ఫ్యాక్టరీ తెరిస్తే తాము ఊరుకునేది లేదని వైసీపీ నేతలను హెచ్చరించారు.

మళ్లీ మొదలైన ఫ్యాక్టరీ

గ్రామస్థులు ఇంత చేసినా వైసీపీ నేతలు మళ్లీ రంగంలోకి దిగారు. ఆదివారంనాడు తమ మనుషులను పంపి రోడ్డుకు అడ్డంగా గ్రామస్థులు కొట్టిన ట్రెంచ్‌ను పూడ్చేశారు. ఫ్యాక్టరీ నుంచి ఒక లోడ్ జల్లిని తీసుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న తిమ్మాపురం గ్రామస్థులు మూకుమ్మడిగా ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని జల్లి రవాణాను అడ్డుకోవడానికి ప్రయత్నించారు. జల్లి లారీతో వచ్చిన కొందరు మనుషులు బెదరలేదు. పైగా అధికార టీడీపీలోని కొందరి పేర్లు ప్రస్తావించి, వారే తమకు జల్లి తోలుకోవడానికి అనుమతి ఇచ్చారని చెప్పినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వైసీపీ నేతలు ఇలా బరితెగించి, మళ్లీ ఎలా ఫ్యాక్టరీ దగ్గరకు రాగలిగారని, ఎలా జల్లిని రవాణా చేయగలుగుతున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫ్యాక్టరీ వల్ల కాలుష్య సమస్యే కాక, ఇళ్లకు కూడా పగుళ్లు ఏర్పడుతున్నాయని వాపోయారు. అప్పోసప్పో చేసి కట్టుకున్న ఇళ్లు ఇలా పగుళ్లబారిన పడితే ఎవరు బాధ్యత వహించాలని నిలదీస్తున్నారు. కొందరు టీడీపీ ప్రముఖుల పేర్లు చెప్పి మరీ వైసీపీ నేతలు దందా నడపడాన్ని గ్రామస్థులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇలా ఖండిస్తున్నవారిలో టీడీపీకే చెందిన వారు కూడా ఉండడం విశేషం. అధికారం మారినా ఇంకా వైసీపీదే గ్రామాలలో దందా నడుస్తున్నదనడానికి ఆ పార్టీ నేతలకు చెందిన తిమ్మాపురం జల్లి ఫ్యాక్టరీనుంచి తరలుతున్న లోడ్లే నిదర్శనం. ఈ ఫ్యాక్టరీకి పొల్యూషన్ సర్టిఫికెట్ కూడా లేనట్లు తెలిసింది. వెంటనే ఇక్కడి వైసీపీ దందాను ఆపాలని గ్రామస్థులు కోరుతున్నారు.



గతంలో ట్రెంచ్‌ను ప్రస్తుతం పూడ్చివేసిన ప్రాంతం వద్ద గ్రామస్థుల ఆందోళన



ఫ్యాక్టరీ వద్ద గుమికూడిన గ్రామస్థులు



వాహనాల రాకపోకలు అడ్డుకునేందుకు గతంలో ట్రెంచ్ కొడుతున్న గ్రామస్థులు (ఫైల్ ఫొటో)

పట్టుబడ్డ గ్రానైట్ లారీ

కుప్పం, ఆగస్టు 18: కుప్పం టూ తమిళనాడు గ్రానైట్ యథేచ్ఛగా తరలుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు హెచ్చరించినా, అక్రమ రవాణా ఆగడంలేదు. గుడుపల్లె మండల పరిధిలో ఆదివారం ఒక గ్రానైట్ లారీ పోలీసులకు పట్టుబడింది. కుప్పం- పలమనేరు జాతయ రహదారిలో ఆదివారం ఉదయం నుంచి గ్రానైట్ లారీలు వరుసగా ప్రయాణించాయి. శాంతిపురం మండలంలోని క్వారీల నుంచి తమిళనాడుకు గ్రానైట్ అక్రమంగా తరలుతున్నదంటూ పోలీసులకు సమాచారం వచ్చింది. గుడుపల్లె మండలం శెట్టిపల్లె వద్ద గ్రానైట్ లారీలు, ట్రాక్టర్లు తమిళనాడు వైపు వెళ్తుండగా ఆ మండల పోలీసులు నిఘా ఉంచి వాహనాలను ఆపారు. అక్రమంగా సరైన అనుమతుల్లేని ఒక కంటైనర్‌ను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇదే మార్గంలో వెళ్తున్న మరికొన్ని గ్రానైట్ వాహనాలను వదిలివేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఎస్ఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. అక్రమంగా తరలుతున్న ఒక గ్రానైట్ లారీని సీజ్ చేసినట్లు తెలిపారు. దీని గురించి మైనింగ్ అధికారులకు కూడా సమాచారం ఇచ్చామన్నారు. ఇంకా ఏవైనా లారీలు వెళ్లినట్లు ఆధారాలుంటే వాటిపైనా చర్యలు తీసుకుంటామని చెప్పారు.



గుడుపల్లె పోలీసు స్టేషన్ ఎదుట ఉన్న గ్రానైట్ లారీ

వర్షాకాలం చెమటలు కక్కుతోంది

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 18: జిల్లాలో వారం రోజులుగా ఎండ వేసవిని తలపిస్తోంది. శని, ఆదివారాల్లో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 9 గంటల నుంచే ఎండ ప్రారంభమై సాయంత్రం వరకు కొనసాగుతుండడంతో వర్షాకాలంలోనూ ఇంటా బయట చెమటలు పడుతున్నాయి. జిల్లావ్యాప్తంగా తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురుస్తూనే ఉన్నా వేడి వాతావరణం ఇబ్బందులకు గురిచేస్తోంది. ఉక్కపోత తట్టుకోలేక ప్రజలు ఫ్యాన్లు, ఏసీలు తిప్పేస్తున్నారు. దీంతో జిల్లాలో విద్యుత్ వినియోగం పెరిగింది. ఇదే పరిస్థితి ఈ వారమంతా కొనసాగుతుందని వాతావరణ శాస్త్రవేత్తలు అంటున్నారు. గాలిలో తేమశాతం తగ్గడంతో పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని తెలిపారు.

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో

డాక్యుమెంట్లు భద్రమేనా?

● దృష్టి పెట్టిన ప్రభుత్వం ● ఆయా కార్యాలయాల్లో లోటుపాట్లను గుర్తిస్తున్న కమిటీ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 18: కీలకమైన ప్రభుత్వ శాఖల్లో ఇటీవల ఫైళ్లు కాలిపోతున్నాయి. గత ప్రభుత్వంలో అక్రమాలు వెలుగు చూడకుండా ఉద్దేశపూర్వకంగా పలుచోట్ల డాక్యుమెంట్లు కాల్చివేస్తున్నట్లు ప్రభుత్వం నిర్ధారించింది కూడా. ఇలాంటి ఘటనలు ఇకపై జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముందుగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలపై దృష్టిపెట్టింది. జిల్లాలోని ఎనిమిది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల తాజా పరిస్థితి తెలుసుకునేందుకు రిజిస్ట్రేషన్, విద్యుత్, ఆర్&బీ, అగ్నిమాపక దళ జిల్లా అధికారులతో కలెక్టర్ ఒక కమిటీని నియమించారు. ఈ బృందాలు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను సందర్శించి అక్కడి లోటుపాట్లపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు రేపోమాపో నివేదిక ఇవ్వనుంది. దీని ఆధారంగా అక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. ఈ క్రమంలో అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను బృందాలు తనిఖీలు చేస్తూ వివరాలు సేకరిస్తున్నాయి. అగ్నిమాపక పరికరాలు, అత్యంత విలువైన డాక్యుమెంట్లు భద్రపరిచే అల్మారాలు, గదులు, విద్యుత్ సరఫరా పరిస్థితి పరిశీలిస్తున్నారు. కాగా, గత 10 రోజుల గడువులో అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గదికొక్క సీసీకెమెరా చొప్పున ఏర్పాట్లు పూర్తయ్యాయి.

సొంత భవనాల నిర్మాణానికి అడుగులు

ప్రభుత్వ ఖజానా నింపే కీలకమైన రిజిస్ట్రేషన్ శాఖకు అనేక సమస్యలు ఉన్నాయి. చిత్తూరు రూరల్, బంగారుపాళ్యం, కార్వేటినగరం, నగరి సబ్ రిజిస్ట్రార్ (ఎస్ఆర్) కార్యాలయాలు అద్దె గదుల్లో అరకొర వసతులతో నామమాత్రపు భద్రత మధ్య కొనసాగుతున్నాయి. ఇక్కడ వేలల్లో విలువైన డాక్యుమెంట్లు ఉన్నాయి. వాటిని భద్రంగా ఉంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సొంత భవనాలు లేని చోట్ల కొత్తగా నిర్మాణాలకు అడుగులు వేస్తోంది. మరో నాలుగు చోట్ల ఉన్న సొంత భవనాల ఆధునికీకరణకు చర్యలు చేపట్టింది.

చర్యలు తీసుకుంటున్నాం

జిల్లాలో అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో డాక్యుమెంట్ల భద్రతపై ప్రభుత్వ ఆదేశాల మేర అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికి బంగారుపాళ్యం తప్ప మిగిలిన కార్యాలయాలను బృంద సభ్యులు పరిశీలించారు. నేడో, రేపో బంగారుపాళ్యం కార్యాలయాన్ని పరిశీలించి కలెక్టర్‌కు తుది నివేదిక అందిస్తాం. వాటి ఆధారంగా అవసరమైన వసతుల కల్పన జరుగుతుంది. కొత్త భవన నిర్మాణాలపై దృష్టి సారించాం. కొన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్థలాల కేటాయింపు కోసం కలెక్టర్‌కు ప్రతిపాదన అందిస్తాం.

\- ఎం. శ్రీనివాసరావు, జిల్లా రిజిస్ట్రార్, చిత్తూరు.

నీటి గుంతలో పడ్డ చిన్నారి

● రక్షించేందుకు దూకిన తల్లి ● ఇద్దరూ మృతి చెందడంతో కాటిపేరిలో విషాదం

చౌడేపల్లె, ఆగస్టు 18: ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడ్డ కూతుర్ని రక్షించేందుకు తల్లి ప్రయత్నించారు. ఈ ప్రయత్నం విఫలమై.. తల్లీ కూతుళ్లు మృతిచెందారు. ఈ విషాద ఘటన చౌడేపల్లె మండలం కాటిపేరిలో ఆదివారం సాయంత్రం జరిగింది. మృతుల కుటుంబీకులు తెలిపిన ప్రకారం.. కాటిపేరికి చెందిన కుమార్ రెడ్డి భార్య మౌనిక(37) మదనపల్లెలో ఎక్సైజ్ డిపార్టుమెంట్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. వీరికి అనీషారెడ్డి(7) కుమార్తె ఉంది. గ్రామ సమీపంలో వీరికి కొంత పొలం ఉంది. అందులో అల్లనేరేడి చెట్లు నాటారు. పక్క పొలం రైతు కొంపల్లె వెంకటరమణ తన పొలంలో చెట్లను పెంచుకునేందుకు నీటి అవసరాల నిమిత్తం పది అడుగుల లోతు గుంతను తవ్వుకున్నారు. ఆ గుంతలోని నీళ్లను ఇద్దరి పొలంలోని చెట్లకు పెట్టి పెంచుతున్నారు. ఈ క్రమంలో నేరేడు చెట్లకు నీళ్లు పెట్టేందుకు ఆదివారం సాయంత్రం తన కుమార్తెతో కలిసి మౌనిక పొలం వద్దకు వచ్చారు. ఈ క్రమంలో చిన్నారి అనీషారెడ్డి ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడింది. దీనిని గమనించిన మౌనిక.. తన కూతురును రక్షించేందుకు నీటిలో దూకారు. గుంతలో మట్టి అధికంగా ఉండటం.. పది అడుగుల మేర నీళ్లు ఉండటంతో మౌనిక అడుగులోని మట్టిలో ఇరుక్కు పోయి అక్కడికక్కడే మృతి చెందారు. దీనిని గమనించిన కుటుంబీకులు పరుగున అక్కడికి చేరుకుని అనీషారెడ్డిని బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న పాపను పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. పాపను రక్షించబోయి తల్లి, చివరకు బిడ్డ కూడా మృతి చెందటంతో గ్రామంలో విషాదం నెలకొంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన మౌనిక



అనీషారెడ్డి



రూ.1,570 కోట్ల పెట్టుబడులతో 15 పరిశ్రమలకు ప్రారంభోత్సవం

రూ.900 కోట్లతో ఏడు పరిశ్రమలకు భూమిపూజ

రూ.1,213 కోట్లతో ఐదు పరిశ్రమల స్థాపనకు ఒప్పందాలు

నేడు శ్రీసిటీకి సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం జిల్లాలోని శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలిని సందర్శించనున్నారు. ఈ సందర్భంగా రూ.1,570 కోట్ల పెట్టుబడులతో, 8,480 మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయిలో ఏర్పాటైన 15 పరిశ్రమలను ప్రారంభించనున్నారు. రూ.900 కోట్ల పెట్టుబడులు, 2,740 మందికి ఉద్యోగాలు కల్పించే ఏడు పరిశ్రమలకు భూమిపూజ చేయనున్నారు. అలాగే రూ.1,213 కోట్ల పెట్టుబడితో 4,060 మందికి ఉద్యోగావకాశాలు కల్పించే మరో ఐదు పరిశ్రమల స్థాపనకు సంబంధిత ప్రతినిధులతో ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు.

- సత్యవేడు

పర్యటన వివరాలిలా..

సీఎం కార్యాలయం నుంచి అందిన అధికారిక షెడ్యూలు ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఉదయం పది గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుంచి బయల్దేరి గన్నవరం విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ 10.40 గంటలకు విమానంలో బయల్దేరి 11.30 గంటలకు తిరుపతి విమానాశ్రయానికి రానున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు శ్రీసిటీ వెళతారు. శ్రీసిటీలో బిజినెస్ సెంటర్ సందర్శించి మధ్యాహ్నం 2.30 వరకూ రెండు గంటల పాటు అక్కడే గడపనున్నారు. నిర్మాణం పూర్తి చేసుకున్న పరిశ్రమలను ప్రారంభించడంతోపాటు కొత్తగా ఏర్పాటు కానున్న పరిశ్రమలకు భూమిపూజ చేస్తారు. అలాగే ప్రతిపాదిత పరిశ్రమల స్థాపనకు ఆయా సంస్థల ప్రతినిధులతో ఒప్పందాలు కుదుర్చుకోనున్నారు. ఈ కార్యక్రమాలు ముగించుకుని మధ్యాహ్నం 2.40 గంటలకు శ్రీసిటీ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి తిరుపతి విమానాశ్రయం చేరుకుని మూడు గంటలకు విమానంలో బయల్దేరి గన్నవరం తిరుగు ప్రయాణం కానున్నారు.

ప్రారంభించనున్న పరిశ్రమలు ఇవే!

శ్రీసిటీలో ఎల్జీ పాలిమర్స్, నైడెక్, ఈప్యాక్ డ్యూరబుల్స్, నియో లింక్ టెలికమ్యూనికేషన్స్, ఓజీ ఇండియా ప్యాకేజింగ్, జెన్ లైనెన్ ఇంటర్నేషనల్, బెల్ ఫ్లేవర్స్ అండ్ ఫ్రాగ్రెన్సెస్, జేజీఐ మెటల్ కన్వెర్ట్స్, త్రినాథ్ ఇండస్ట్రీస్, ఎవర్ షైన్ మౌల్డర్స్, ఆటోడేటా, ఎస్‌కే కాంపొనెంట్స్, అడ్మైర్ కేబుల్స్, బాంబో కోటెడ్ అండ్ స్పెషల్ స్టీల్, శ్రీలక్ష్మీ ఆగ్రో ఫుడ్స్ తదితర 15 పరిశ్రమలతోపాటు శ్రీసిటీ ఈఎంసీ ఫైర్ స్టేషన్‌ను కూడా సీఎం చంద్రబాబు ప్రారంభించనున్నారు. ఈ పరిశ్రమలు ఇండియాతోపాటు జపాన్, దక్షిణ కొరియా, జర్మనీ, ఇజ్రాయెల్ తదితర దేశాలకు సంబంధించినవి.

భూమిపూజ చేయనున్నవి

బ్లూస్టార్, ఎన్జీసీ ట్రాన్స్‌మిషన్, సిద్ధార్థ లాజిస్టిక్స్, టీఐఎల్ హెల్త్ కేర్, ఏజీపీ సిటీ గ్యాస్, ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్, వెర్మిరెన్ రిహాబ్ తదితర ఏడు పరిశ్రమలతోపాటు హైటెక్ పోలీస్ స్టేషన్ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. ఈ పరిశ్రమలు మనదేశంతోపాటు జపాన్, బెల్జియం, చైనా తదితర దేశాలకు చెందినవి.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులు

అధికారుల పరిశీలన

శ్రీసిటీలో ఏపీఐఐసీ ఎండీ అభిషిక్త కిషోర్, కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం భన్సల్, ఎస్పీ సుబ్బరాయుడు పర్యటించారు. ఏర్పాట్లను పరిశీలించారు.

శ్రీసిటీకి ఆరోసారి వస్తున్న బాబు

చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో శ్రీసిటీ పర్యటనకు సోమవారం ఆరోసారి విచ్చేయనుండడం విశేషం. శ్రీసిటీ సెజ్ ఏర్పాటయ్యాక 2015 ఏప్రిల్ 3న తొలిసారి పెప్సీ పరిశ్రమ ప్రారంభానికి విచ్చేశారు. అదే రోజు శ్రీసిటీలో 11 పరిశ్రమలకు భూమిపూజ చేశారు. 2016 ఏప్రిల్ 25, 27 తేదీల్లో రెండుసార్లు వచ్చారు. మాండలెజ్, ఇసుజు పరిశ్రమల ప్రారంభోత్సవాలు చేశారు. 2018 జనవరి 9న అపోలో టైర్స్ పరిశ్రమ భూమిపూజకు, 2018 మార్చి 23న హీరో మోటార్స్ పరిశ్రమ భూమిపూజకు శ్రీసిటీకి విచ్చేశారు. ఇక వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్కసారైనా శ్రీసిటీకి రాని సీఎంగా జగన్ నిలవడం గమనార్హం.

ఐదు సంస్థలతో ఒప్పందాలు

డైకిన్, యాక్సెలెంట్ ఫార్మా, ఆర్మ్ వెస్ట్ మిర్రైటెక్ ఇండియా, క్యాప్ మ్యాన్ ఇండియా, పీఐ ప్రిస్టేజ్ ఇంటర్నేషన్ తదితర ఐదు పరిశ్రమల ఏర్పాటుకు ఆయా సంస్థల ప్రతినిధులతో ఎంఓయూలు కుదుర్చుకుంటారు. ఇవన్నీ మన దేశంతోపాటు జపాన్, సింగపూర్, ఇండోనేషియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ తదిర దేశాలకు సంబంధించినవి. అనంతరం శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల సీఈవోలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు.

పటిష్ఠ బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 18: శ్రీసిటీ పర్యటనకు సీఎంతోపాటు హోంమంత్రి వంగలపూడి అనిత, డీజీపీ ద్వారకా తిరుమలరావు వస్తుండడంతో జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేసింది. డీజీపీ ఆధ్వర్యంలో ఎస్పీ సుబ్బరాయుడు స్వీయ పర్యవేక్షణలో ముగ్గురు అదనపు ఎస్పీలు, 10 మంది డీఎస్పీలు, 20 మంది సీఐలు, 25 మంది ఎస్ఐలు, 100 మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 150 మంది కానిస్టేబుళ్లు, 60 మంది రిజర్వు బలగాలు, రోప్‌పార్టీలు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు బందోబస్తులో ఉన్నాయి. వీరితోపాటు కాన్వాయ్ పార్టీలో ఆరు బృందాలున్నాయి.

చంద్రబాబు 70 రోజుల పాలనలోనే..

శ్రీసిటీకి రూ.2వేల కోట్ల పెట్టుబడులు

- 6,800 మందికి ఉద్యోగావకాశాలు
- గతంలో సీఎంగా వుండగా వంద పరిశ్రమల ఏర్పాటు
- ఇపుడూ అదే చొరవ.. పట్టుదల

తిరుపతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ముఖ్యమంత్రిగా పాలనా పగ్గాలు చేపట్టి నేటికి కేవలం 70 రోజులవుతోంది. ఈ స్వల్ప వ్యవధిలోనే జిల్లాలోని శ్రీసిటీకి రూ.2వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయి. 6,800 మంది యువతకు ఉద్యోగాలు కల్పించే అవకాశాలు ఏర్పడుతున్నాయి. గతంలో 2014-19 నడుమ సీఎంగా వున్న సమయంలో ఆయన చొరవ కారణంగా ఏకంగా వంద పరిశ్రమలు శ్రీసిటీలో ఏర్పాటైన సంగతి తెలిసిందే. తాజాగా పాలనపై పట్టు రావాలని కాలయాపన చేయకుండా అధికారంలోకి వచ్చీరాగానే సొంత జిల్లా పట్ల, ప్రత్యేకించి పారిశ్రామిక అభివృద్ధి పట్ల అదే చొరవ, పట్టుదల వ్యక్తమవుతుండడం జిల్లావాసుల్లో హర్షాతిరేకాలు నింపుతోంది. చంద్రబాబు చొరవ, పట్టుదల చూస్తుంటే రానున్న రోజుల్లో శ్రీసిటీకి తద్వారా జిల్లాకు పారిశ్రామికంగా భారీ పెట్టుబడులు, ప్రయోజనాలు సమకూరే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి.

సగం పరిశ్రమలు బాబు హయాంలోనే ఏర్పాటు

సత్యవేడు, వరదయ్యపాలెం మండలాల పరిధిలో నెలకొల్పిన శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలిలో ప్రస్తుతం 220 పరిశ్రమలు నడుస్తున్నాయి. ఈ పరిశ్రమల ద్వారా రూ.45వేల కోట్ల పెట్టుబడులు జిల్లాకు వచ్చాయి. వీటిలో 62వేల మంది ఉద్యోగులు పని చేస్తుండగా 70 శాతం మంది రాష్ట్రానికి చెందిన వారుండగా మొత్తం మీద 40 శాతం మంది జిల్లావాసులున్నారు. శ్రీసిటీ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏర్పాటైనప్పటికీ అందులో పరిశ్రమల స్థాపనకు 2014-19 నడుమ చంద్రబాబు ప్రభుత్వం విశేషంగా కృషి చేసింది. సొంత జిల్లా కావడంతో ఆయన శ్రీసిటీపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో ఆ ఐదేళ్లలో ఏకంగా వంద పరిశ్రమలు శ్రీసిటీకి తరలివచ్చాయి. వాటిలో పెప్సీకో, మాండలెజ్, ఇసుజు, ఫాక్స్ కాన్, హీరో మోటార్స్, అపోలో టైర్స్ వంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పరిశ్రమలు వున్నాయి. ఈ పరిశ్రమల కారణంగా పారిశ్రామిక పటంలో జిల్లా కీర్తిప్రతిష్ఠలు అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడించాయి.



ప్రారంభానికి సిద్ధమైన ఈప్యాక్ డ్యూరబుల్ కంపెనీ

వైభవంగా వేణుగోపాలస్వామి తెప్పోత్సవాలు



తిరువీధి ఉత్సవానికి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, తెప్పపై రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

వెదురుకుప్పం, ఆగస్టు 18: కార్వేటినగరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి తెప్పోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండో రోజైన ఆదివారం స్వామివారు స్కంద పుష్కరిణిలో తెప్పపై విహరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఉదయం ముందుగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణ, మంగళ వాయిద్యాల నడుమ తిరువీధి ఉత్సవం నిర్వహించారు. పుర వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి, సంగీత కార్యక్రమాలు జరిగాయి. టీటీడీ డిప్యూటీ ఈవో నాగలక్ష్మి, ఆలయాధికారి సురేష్‌కుమార్, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం..ఒకరి అరెస్టు



పలమనేరు, ఆగస్టు18 : కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ నరసింహ రాజు కథనం మేరకు.. ఆదివారం పలమనేరులోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేపట్టారు. బెంగళూరు వైపు నుంచి వస్తున్న కారును తనిఖీ చేయగా అందులో 16కేసుల్లో మద్యం ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 1100 టెట్రా ప్యాకెట్లు, 48 బీర్లు ఉన్నాయి. కారు నడుపుతున్న పుంగనూరుకు చెందిన రాజేష్(36)ను అదుపులోకి తీసు కున్నారు. పట్టుబడిన మద్యం విలువ రూ.75,600, కారువిలువ రూ.2.5 లక్షలు ఉంటుంది. పలమనేరు ఎస్బీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు ఇచ్చిన సమాచారం మేరకు మద్యాన్ని పట్టుకున్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల వేదిక

చిత్తూరు, ఆగస్టు 18: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశ మందిరంలో జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు వినతులు సమర్పించవచ్చునని పేర్కొన్నారు. అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ మణికంఠ తెలిపారు. బాధిత ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పుకోవచ్చునని వెల్లడించారు.

దేవరెద్దుకు పూజలు



దేవరెద్దును తీసుకొస్తున్న ఏఎల్‌పురం గ్రామస్తులు, పూజలు చేస్తున్న వేదగిరి వంశస్థులు

గుడిపాల, ఆగస్టు 18: మండలంలోని ఏఎల్‌పురంలో దేవరెద్దుకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఇక్కడ గతంలో ఉన్న దేవరెద్దు మృతి చెందడంతో ఐరాల మండలం వేదగిరివారిపల్లె నుంచి తీసుకొచ్చేందుకు వేదగిరి వంశస్థులు అభిషేకం, పూజలు చేయించారు. ఈ ఎద్దుకు ఏటా దేవరపబ్బం నిర్వహిస్తామని గ్రామస్తులు తెలిపారు.

విద్యార్థులకు డెంగ్యూ

పుంగనూరు రూరల్, ఆగస్టు18: ఇద్దరు విద్యార్థులకు డెంగ్యూ జ్వరం సోకి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పుంగనూరు మండలం భీమగానిపల్లె పంచాయతీ రాంపల్లెకు చెందిన భార్గవ్(13) కొత్తయిండ్లు మున్సిపల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నారు. మూడు రోజుల కిందట జ్వరం రావడంతో ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ అని నిర్ధారణ అయింది. అలాగే, పలమనేరు మండిపేటకోటూరుకు చెందిన మూడో తరగతి విద్యార్థిని మోక్షిత(9) కూడా డెంగ్యూ జ్వరంతో పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది.

పంట పొలాలపై ఏనుగుల దాడి

వరి, చెరకు పంటలకు తీవ్రనష్టం



ఐరాల, ఆగస్టు 18: మండలంలోని పోతపోలఇండ్లలో శనివారం అర్ధరాత్రి ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసింది. వరి, చెరకు పంటలను ధ్వంసం చేశాయి. జయమ్మ, రఘునాథ్, భాస్కరయ్యకు చెందిన వరి, హరి, రామకృష్ణకు చెందిన చెరకు తోటను ఏనుగులు తొక్కి, తిని, ధ్వంసం చేశాయి. సుమారు మూడు ఎకరాలలో పంటను నాశనం చేశాయి. పోతపోలఇండ్లు అటవీ ప్రాంతానికి దగ్గర్లో ఉండటంతో ఏనుగులు తరచూ పంట పొలాలపై దాడి చేస్తున్నాయి. అటవీ శాఖ అధికారులు స్పందించి, నష్టపరిహారం ఇప్పించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో కస్తూరిబా పాఠశాల ఆయా మృతి



సెల్వి మృతదేహం

కుప్పం, ఆగస్టు 18: కుప్పం మండలం పరమసముద్రం వద్ద ఉన్న కస్తూరిబా గురుకుల పాఠశాల బాలికల వసతి గృహంలో ఆయా (హౌస్ కీపర్)గా పనిచేస్తున్న సెల్వి (50) అనుమానాస్పదరీతిలో మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఈమె పదేళ్లుగా ఇక్కడ పని చేస్తున్నారు. శనివారం సాయంత్రం తన వొంటిమీది కమ్మలు వేరొకరికి తీసిచ్చారు. కొద్దిసేపటి తర్వాత చూస్తే వసతి గృహం ఆవరణలోని నీటి సంపులో సెల్వి పడిపోయి కనిపించారు. వెంటనే వెలికి తీసి కుప్పం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆమె మృతి చెందారు. ఆదివారం ఎంఎస్‌పీ నేతలు దేవరాజ్, మురుగేశ్, గోవిందప్ప, కోదండప్పలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సెల్వి మృతదేహాన్ని సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ సెల్వి మృతికి గల కారణాలను వెలికితీసి బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసులను డిమాండ్ చేశారు. మృతురాలి భర్త వి.మునిరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కుప్పం అర్బన్ సీఐ జీటీ నాయుడు తెలిపారు.

పులి దాడిలో ఆవు మృతి!



చనిపోయిన ఆవును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

చౌడేపల్లె, ఆగస్టు 18: పులి దాడిలో పాడి ఆవు మృతి చెందిన సంఘటన చౌడేపల్లె మండలంలో ఆదివారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు.. పెద్దకొండామారి పంచాయతీ రాజనాలబండ సమీపంలోని బోడిపై ఇండ్లకు చెందిన బాషా ఆవులు మేపుకుంటు జీవనం సాగించేవాడు. రెండు రోజుల క్రితం మేతకు వెళ్లిన తన పాడి ఆవు తిరిగి ఇంటికి రాలేదు. ఈక్రమంలో రెండు రోజుల నుంచి రాజనాలబండ సమీపంలోని అటవీప్రాంతంలో ఆవు కోసం గాలిస్తున్నారు. రాజనాలబండ ఆటవిప్రాంతంలో పులి దాడిలో ఆవు మృతి చెంది పడి ఉండగా గుర్తించారు. రెవెన్యూ, అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న అటవీశాఖ అధికారులు అడుగులు, దాడి తీరును పరిశీలించి పులి దాడి చేసిఉంటుందన్నారు. చుట్టు పక్క గ్రామాలలో పశువుల మేత కోసం అడవిలోకి వెళ్లకూడదని చాటింపు వేయించారు. తన జీవనాధారమైన రూ.70వేల విలువైన ఆవు మృతి చెందటంతో తీవ్రంగా నష్టపోయానని ప్రభుత్వం ఆదుకోవాలని బాషా కోరారు.

రంకేసిన కోడె గిత్తలు

గడ్డంవారిపల్లెలో పశువుల పండుగ



కల్లూరు, ఆగస్టు 18: పులిచెర్ల మండలం గడ్డంవారిపల్లిలో ఆదివారం ఘనంగా పశువుల పండుగ నిర్వహించారు. ఏటా జనవరిలో పశువుల పండుగ నిర్వహించడం ఆనవాయితీ. కొన్ని అనివార్య కారణాలతో జనవరిలో పశువుల పండుగ నిర్వహించలేదు. దీంతో ఈ గ్రామంలో ఆదివారం పశువుల పండుగ జరిపారు. ముందుగా గ్రామంలోని రాజవీధిలో గ్రామదేవతకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం పశువులను అలంకరించారు. కొమ్ముల మధ్య చెక్క పలకలు, కొత్త టవళ్లు చుట్టారు. రాజవీధికి పశువులను తీసుకొచ్చి పరుగు తీయించారు. వీటిని నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. పశువుల పరుగును తిలకించేందుకు వచ్చిన జనంతో గ్రామం కిక్కిరిసింది. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, వైస్ ఎంపీపీ రాశిప్రసాద్, సర్పంచులు షుకూర్, మధు, అనితగోపినాధరెడ్డి, వెంకటేష్, ఎంపీటీసీ రెడ్డిఅహ్మద్, టీడీపీ నాయకులు రవినాయుడు, నాగరాజనాయుడు, మురళి తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 18: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచేగాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రం నుంచీ వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచే క్యూలన్నీ నిండిపోయాయి. ప్రతి భక్తుడికి స్వామి దర్శనం కల్పించేలా ఆలయాధికారులు చర్యలు చేపట్టారు.

గంగమ్మ నామస్మరణతో మార్మోగిన బోయకొండ



గంగమ్మను దర్శించుకోవడానికి క్యూలో వేచియున్న భక్తులు

చౌడేపల్లె, ఆగస్టు18: బోయకొండ ఆదివారం గంగమ్మ నామస్మరణతో మార్మోగింది. అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి, అమ్మవారికి ప్రీతికరమైన వేపాకు తోరణాలతో ఆలయాన్ని అలంకరించారు. అమ్మవారికి అభిషేకాలు అర్చనలు చేసి, స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, ధూప దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచేగాక తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు.

అక్రమార్కులపై తిరుపతి ఎస్పీ కొరడా

- గ్రావెల్ అక్రమ రవాణాకు సహకరించిన హెడ్‌కానిస్టేబుల్, హోం గార్డు సస్పెన్షన్
- చంద్రగిరి సీఐకి చార్జి మెమో
- అనధికారిక జరిమానా వసూలు చేస్తున్న మరో హోంగార్డుపైనా వేటు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 18: అక్రమార్కులపై ఎస్పీ సుబ్బరాయుడు కొరడా ఝుళిపించారు. ఓ హెడ్ కానిస్టేబుల్‌తోపాటు ఇద్దరు హోంగార్డులను ఆదివారం సస్పెండ్ చేశారు. ఓ సీఐకి చార్జి మెమో ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి. చంద్రగిరి మండలంలోని గంగుడుపల్లె, మండపంపల్లె గ్రామాల సమీపం నుంచి మల్లయ్యపల్లె మీదుగా గ్రావెల్ తవ్వి టిప్పర్ల ద్వారా అక్రమంగా రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ అధికారుల కళ్లు కప్పి కొద్ది రోజులుగా జరుగుతున్న ఈ అవినీతి తంతుపై చంద్రగిరి సీఐ రామయ్యకు ఫిర్యాదులు అందాయి. ఈ విషయం బయటకు పొక్కకుండా హెడ్‌కానిస్టేబుల్ ఎస్.బసవయ్య, హోంగార్డు సుధాకర్‌లను వెంటనే గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకోవాలని ఆదేశించారు. సీఐ ఆదేశాలను వారు పట్టించుకోలేదు. మరోవైపు ఈ అంశంపై స్థానికులు కొందరు నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన ఆయన గ్రావెల్ అక్రమంగా రవాణా చేస్తున్నవారికి తమ సిబ్బంది వంత పాడినట్లు నిరూపణ అయింది. దాంతో చంద్రగిరి సీఐ రామయ్యకు చార్జి మెమో జారీ చేశారు. రక్షక్ మొబైల్ హెడ్‌కానిస్టేబుల్ బసవయ్య, హోంగార్డు సుధాకర్‌ను సస్పెండ్ చేశారు. శాఖాపరమైన విచారణకూ ఆదేశించారు. అలాగే తిరుపతి ట్రాఫిక్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు శ్రీనివాసులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై అనధికారికంగా జరిమానా విధిస్తున్నాడని ఎస్పీకి ఫిర్యాదు అందింది. విచారణలో అక్రమ వసూళ్లు చేస్తున్నది నిజమని తేలడంతో అతడినీ సస్పెండ్ చేశారు. పోలీసు శాఖలోని ప్రతి ఒక్కరూ ప్రజల మన్ననలు పొందేలా పనిచేయాలని ఎస్పీ పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఏ స్థాయి అధికారైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు.

ఏడు మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 18: జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో ఏడు మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదైంది. బైరెడ్డిపల్లిలో 28.6, వి.కోట 8.2, రామకుప్పం 8.2, శాంతిపురం 4.6, చౌడేపల్లి 4.2, పలమనేరు 3.4, పుంగనూరులో 2.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

త్వరలో జేసీ బాధ్యతల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 18: జాయింట్ కలెక్టర్‌గా అభిషేక్ రెండు మూడు రోజుల్లో బాధ్యతలు చేపట్టనున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారిగా పనిచేస్తున్న ఆయన్ను జిల్లాకు జేసీగా బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే.

పాఠశాలకు పూర్వ విద్యార్థి టేబుల్ వితరణ



జావిద్‌ను సన్మానిస్తున్న హెచ్‌ఎం మునాఫ్

పలమనేరు, ఆగస్టు 18 : పలమనేరు గంటావూరు ఉర్దూ పాఠశాల పూర్వ విద్యార్థి జావిద్ పాఠశాలకు రూ.15 వేలు విలువగల టేబుల్‌ను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మునాఫ్ దాత జావిద్‌కు శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసీ ఛైర్మన్ రియాజుద్దీన్, పాఠశాల వైస్ ఛైర్మన్ హసీనా, టీచర్ పర్వీన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 49 మంది ఎంపిక



కుప్పం, ఆగస్టు 18: సాయిమాతా సేవాట్రస్టు ఆధ్వర్యంలో బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఆదివారం కుప్పంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి దాదాపు 180 మంది హాజరై పరీక్షలు చేసుకున్నారు. వీరిలో కంటి ఆపరేషన్ల కోసం 49 మందిని వైద్యులు ఎంపిక చేశారు. ఎంపిక చేసిన వారికి బెంగళూరు శంకర కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని సాయిమాతా సేవాట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు తెలిపారు. కంటి పరీక్ష శిబిరంలో జగదీశ్‌బాబుతోపాటు వైద్య బృందం గంగాధర్, శివ, బాలయ్య, లావణ్య, నేత్ర, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

బోరును బాగుచేసిన అధికారులు



పలమనేరు, ఆగస్టు18: పలమనేరు లక్ష్మీనగర్ కాలనీలోని బోరును అధికారులు బాగు చేశారు. పాడైన బోరును బాగుచేయాలని బోరు పైపులు తొలగించిన మున్సిపల్ సిబ్బంది ఆ తర్వాత పట్టించుకోలేదు. దీనిపై ఆదివారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'బోరును బాగు చేయించండి' అనే శీర్షికన వార్త ప్రచురితమైంది. మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి స్పందించారు. లక్ష్మీనగర్ కాలనీకి వాటర్‌వర్క్స్ సిబ్బందిని పంపించి వెంటనే బోరును బాగుచేయించారు. కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత ఐవీఎస్ వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

పలమనేరు, ఆగస్టు18 : పలమనేరు రంగబాబు సర్కిల్ సమీపంలోని వియ్‌కేర్ ఐ.వి.ఎఫ్. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఆదివారం నిర్వహించిన ఐవీఎస్ ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. దాదాపు 100కు పైగా సంతానం లేని దంప తులకు ఉచిత స్కానింగ్‌లు, ఉచిత వీర్యకణాల పరీక్షలు నిర్వహించారు. సీనియర్ డాక్టర్ అంజుమున్నిసా, ఇన్‌ఫెర్టిలిటి స్పెషలిస్టు డాక్టర్ తనూజ, డాక్టర్ ఎస్ ఖలీలుల్లాలు దంపతులకు పరీక్షలు నిర్వహించారు.

మద్యం, గంజాయి రవాణాను అరికట్టండి : అమర్



సీఐలతో మాట్లాడుతున్న పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఆగస్టు18 : మద్యం, గంజాయి వంటి అక్రమ రవాణా అరికట్టాలని నూతన సీఐలకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. పలమనేరు నియోజక వర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేయాలని కోరారు. ఆదివారం పలమనేరులోని తన కార్యాలయంలో నియోజకవర్గంలోని సీఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం అటు తమిళనాడు, ఇటు కర్ణాటక రాష్ట్రాలకు చేరువలో ఉన్నందున మద్యం, గంజాయి రవాణాపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అసాంఘిక శక్తులను పూర్తిగా అణచి వేయాలన్నారు. పలమనేరు, వి.కోటలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో పలమనేరు అర్బన్, పలమనేరు రూరల్, గంగవరం, వి.కోట సీఐలు మురళీమోహన్, నరసింహరాజు, ప్రసాద్, సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కంటి చికిత్స శిబిరానికి విశేష స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రామకుప్పం, ఆగస్టు 18: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల ఆస్పత్రి, రామకుప్పం వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉచిత కంటి చికిత్స శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో మొత్తం 120మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 35మందిని మెరుగైన వైద్యం, శస్త్ర చికిత్సల కోసం పీఈఎస్‌కు రెఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హర్షిత, పుష్పక్, ఏఎంసీ మాజీ వైస్ ఛైర్మన్ సీతాపతి, పీఈఎస్ ఆస్పత్రి పీఆర్‌వో వెంకటేశ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సదుం, ఆగస్టు18: మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 2006-2007 ఏడాదిలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో సమావేశమయ్యారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పరస్పర యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆనందపరవశులయ్యారు. టెన్త్ పూర్తి చేసి 15 సంవత్సరాలు గడచిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. తమ సమ్మేళనానికి గుర్తుగా వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

బాలికపై వానరం దాడి

పుంగనూరు రూరల్, ఆగస్టు18: బాలికపై వానరం దాడి చేసి గాయపరిచిన సంఘటన రెండు రోజుల క్రితం పుంగనూరు మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని సింగిరిగుంట పంచాయతీ మార్లపల్లెకు చెందిన వంశీకృష్ణ కుమార్తై మోక్షిత(9) గ్రామంలోనే 3వ తరగతి చదువుతోంది. గ్రామంలోని చిల్లర దుకాణంలో తినుబండరాలు తీసుకెళుతుండగా కోతి దాడి చేసి చేతిపై గాయపరించింది. పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు అందిస్తున్నారు.

ఎద్దుల పరుగు పందేలు
పలువురికి గాయాలు

కుప్పం, ఆగస్టు 18: కుప్పం మండలంలోని చెక్కునత్తం గ్రామంలో ఆదివారం ఎద్దుల పరుగు పందేలు నిర్వహించారు. ఆంధ్రా నుంచే కాక, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా పందెపుటెద్దులను తీసుకొచ్చిన యువకులు పందేలలో పాల్గొ న్నారు. స్థానికుల యువకుల ఆధ్వర్యంలో బ్యారికేడ్లను ఏర్పాటు చేసి ఎద్దులను పరుగు పెట్టించారు. పలువురు యువకులు బ్యారికేడ్లను దాటుకుని వచ్చి ఎద్దులను పట్టుకోబోయారు. పలువురు అదుపుతప్పి కిందపడ్డారు. ఎద్దులతోపాటు బరిలో చాలా దూరం నేలమీద పడి జారారు. పలువురికి రక్తగాయాలయ్యాయి.

పుంగనూరు కవులకు ఘన సన్మానం



పుంగనూరు, ఆగస్టు18: పుంగనూరు కవులను కర్ణాటక రాష్ట్రం బెంగళూరులోని ఇండోయేషియన్ అకాడమీ వారు ఘనంగా సన్మానించారు. ఆదివారం బెంగళూరులో జరిగిన కవిసమ్మేళనంలో పుంగనూరు చెందిన కవులైన స్రవంతి, గాయత్రిదేవి, రహత్‌జాన్, హసీనాబేగంలను మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణన్ మనవడు సుబ్రహ్మణ్యశర్మ అకాడమీ ప్రొఫెసర్ ఏకాంబరం ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



పుంగనూరు, ఆగస్టు18: పట్టణంలోని మాదాద్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్, అలుమిని, దారుల్‌హుదా ఆధ్వ ర్యంలో హర్ ఘర్ తిరంగాపై వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కొత్త యిండ్లు మున్సిపల్ పాఠశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచారు. వీరికి రూ.5001 అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన తాటిమాకులపాళ్యంలోని జ్ఞానాంబిక పాఠశాల విద్యార్థులకు రూ.3001, తృతీయ స్థానంలో నిలిచిన జడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థులకు రూ.2001 బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అయూబ్‌అలిఖాన్, షావలి, కృష్ణప్ప, సుబేదార్, రెడ్డెప్ప, హుదాహి, వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

26న ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



పుంగనూరు రూరల్, ఆగస్టు 18: ఈ నెల 26న నిర్వహించే శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు యాదవ సంఘ నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక కృష్ణమరెడ్డిపల్లె మార్గంలోని కృష్ణాలయం వద్ద యాదవ సంఘనాయకులు, కులస్తులు ఏర్పాట్లుపై చర్చించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 25న రాత్రి శ్రీకృష్ణుని ఊంజల్‌సేవ, 26న స్వామి వారికి అభిషేకాలు, గోపూజ నిర్వహించి స్వామివారిని ప్రత్యేక పల్లకిలో ఊరేగించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొంటారని నియోజవర్గంలోని యాదవ కులస్తులు అధికసంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జీవో 117 రద్దుకు కృషి చేయాలి



రాష్ట్ర నేతలకు వినతిపత్రమిస్తున్న జిల్లా నాయకులు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 18 : విద్యా వ్యవస్థకు నష్టం చేకూర్చుతున్న జీవో 117ను రద్దు చేసే విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్, మోహన్ యాదవ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ కోరారు. ఈ మేరకు ఆదివారం విజయవాడలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రఘునాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డిలను కలిసి వినతిపత్రం అందజేశారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, తుది చెల్లింపులు, 12వ పీఆర్సీ మధ్యంతరం భృతి, ఉమ్మడి సర్వీసు రూల్స్ రేషనలైజేషన్ అమలుకు చర్యలు చేపట్టాలని కోరారు.

ఎంపీపీ అశ్వని రాజీనామా చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

కుప్పం, ఆగస్టు 18: పంచాయతీ ట్రాక్టర్ చోరీ కేసులో వైసీపీ మండల కన్వీనర్ హెచ్‌ఎం.మురుగేశ్ అరెస్టు అయ్యారని చిత్తశుద్ధి ఉంటే ఆయన కుమార్తె ఎంపీపీ అశ్వని తన పదవికి రాజీనామా చేయాలని కుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో సాగిన అరాచకాలు అన్నీఇన్నీ కావన్నారు. ఎంపీపీ అశ్వని కుటుంబం భూకబ్జాలకు, దళితులపై దాడులకు తెగబడిన విషయాన్ని ఎవరూ మరచిపోలేదన్నారు. చివరకు పంచాయతీ చెత్త సేకరణ ట్రాక్టర్‌ను ఆమె తండ్రి మురుగేశ్ చోరీ చేసి ఇంటి దగ్గర పెట్టుకున్నారని, ఆ కేసులోనే ఆయన అరెస్టు అయ్యారని చెప్పారు. నీటి ట్యాంకు కోసం కేటాయించిన స్థలాన్ని, అంధుడైన కన్మణి అనే రైతుకు చెందిన 35 సెంట్ల భూమిని కబ్జా చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న చరిత్ర ఆయనకు ఉందని విమర్శించారు. రోడ్డు విస్తరణ పేరుతో ఏకంగా చెరువునే మింగేసేందుకు కుట్ర పన్నారని, ఆ క్రమంలో అడ్డొచ్చిన ఎమ్మార్పీఎస్ నేతలపై విచక్షణారహితంగా దాడిచేసిన హత్యా యత్నానికి పాల్పడ్డారని ధ్వజ మెత్తారు. టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించి, వేధింపులకు గురిచేసిన ఘన చరిత్ర వైసీపీ నేతల దేనన్నారు. ఇప్పుడు చట్టం తనపనితాను చేసుకుని పోతుంటే ఎంపీపీ అశ్వని లేఖలు రాసి అన్యాయమని ఆక్రో శించడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక మాత్రమే నియోజకవర్గ ప్రజలు ఊపిరి పీల్చు కుంటున్నారని, చట్టం తనపనితాను చేసుకుని పోతోందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉన్సిగానిపల్లె పంచాయతీలో తాగునీటి సమస్య

రామకుప్పం, ఆగస్టు 18: రామకుప్పం మండలం ఉన్సిగానిపల్లె పంచాయతీలో ప్రజలు తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు. గ్రామాల్లో తాగునీటి పథకాల నిర్వహణ లోపం, బోర్లలో జలాలు అడుగంటడం వల్ల సమస్యలు తలెత్తాయి. గోవిందపల్లె సంత స్థలంలోని బోరులో జలాలు పుష్కలంగా ఉన్నా అందులోని మోటారు, పంపును ఓ నేత తీసుకెళ్లినట్లు ఆరోపణలున్నాయి. దీంతో ఆ బోరు నిరుపయోగంగా మారింది. ఎస్సీ కాలనీలో బోరులో నీటి మట్టం తగ్గింది. చెరువులోని మరో బోరులోనూ జలాలు అడుగంటాయి. దీంతో ఎస్సీకాలనీ, మెయిన్‌రోడ్డు, బీసీ కాలనీలో కొంత ప్రాంతంతో తాగునీటి అందక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా రక్షిత మంచినీటి పథకాల బోర్లలో జలాలు అడుగంటడం, ప్రధాన పైపులైన్ల నుంచి కొందరు కొళాయి కనెక్షన్లు తీసుకోవడం వల్ల లింగాపురం, జౌకుపల్లె, జోగిండ్లు, ఆనిగానూరు గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొందని స్థానిక టీడీపీ నేతలు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పుంగనూరు సీఐ శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ



సీఐ శ్రీనివాసులును సన్మానిస్తున్న జనసేన నాయకులు

పుంగనూరు రూరల్, ఆగస్టు18: పుంగనూరు అర్బన్ సీఐగా శ్రీనివాసులు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ రాఘవరెడ్డి బదిలీ కావడంతో చిత్తూరు వీఆర్‌లో ఉన్న జయరామయ్య కొన్నిరోజులు ఇన్‌చార్జి సీఐగా బాధ్యతలు నిర్వహించారు. ఈ క్రమంలో తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్‌లో సీఐగా పనిచేస్తున్న సీఐ శ్రీనివాసులును పుంగనూరుకు బదిలీ చేయడంతో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ చోరీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య, మైనర్ బాలురు బైక్‌లు నడపకుండా చర్యలు, మినీబైపాస్, బైపాస్‌రోడ్డుపై పిల్లలు బైక్‌లను విచ్చలవిడిగా అతివేగంగా నడుపుతున్నట్లు తన దృష్టికి రావడం జరిగిందన్నారు. వీటిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. కాగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ శ్రీనివాసులును జనసేన నాయకులు పగడాల రమణ, విరూపాక్షి, హరినాయక్, బాలాజీ నాయక్, టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సుహేల్ బాషా, గంగధర్ తదితరులు సన్మానించారు.

పురాణం త్యాగమూర్తి శర్మ మృతి సాహితీలోకానికి తీరని లోటు



మాట్లాడుతున్న రచయితల సంఘ నాయకులు

పలమనేరు, ఆగస్టు 18: ప్రముఖ సాహితీవేత్త, సీనియర్ పాత్రికేయులైన పురాణం త్యాగమూర్తి శర్మ మృతి తెలుగు సాహితీలోకానికి తీరని లోటు అని జిల్లా రచయితల సమాఖ్య సమన్వయకర్తలు పలమనేరు బాలాజి, సాకం నాగరాజులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో పురాణం త్యాగమూర్తి మృతికి రచయితల సంఘ సభ్యులు సంతాపం తెలియజేసి మాట్లాడారు. పురాణం త్యాగమూర్తి తెలుగు, ఆంగ్ల భాషల్లో అనేక పుస్తకాలను రచించి, ప్రిన్సిపాల్‌గా ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి ఆదర్శంగా నిలిచారన్నారు. మదనపల్లె రచయితల సంఘం ద్వారా సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలను వైభవంగా నిర్వహించి, సీనియర్ జర్నలిస్టుగా, ఆంధ్ర సాహిత్య అకాడమీ సభ్యుడిగా విశేష సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రచయితల సంఘ సభ్యులు ఆర్.మాధవ్, కుమారస్వామిరెడ్డి, తులసీ నాథం నాయుడు, యుగంధర్, గిరిధరమూర్తి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, దోర్నాదుల సిద్దార్థ, గండికోట వారిజ, గ్రంథాలయ అధికారి హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రమణీయం లక్ష్మీనారాయణుల కల్యాణం



ఉభయదారులకు చిత్రపటం అందజేస్తున్న ఆలయాధికారులు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 18: వేపంజేరి లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేతుడైన ఏడుకొండలరాయుడిని పట్టు వస్త్రాలు, పూలహారాలతో అలంకరించి, కల్యాణోత్సవం నిర్వహించారు. తమిళనాడు రత్నగిరికి చెందిన శేషాచారి, చెన్నైకి చెందిన లోకనాథ్‌గుప్తా, తిరుపతికి చెందిన జయంతి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారిని సన్మానించి, స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ భాగవతార్ రామకృష్ణారెడ్డి హరికథా కాలక్షేపం చేశారు. ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి పాల్గొన్నారు.

విద్య ఉన్నత శిఖరాలకు చేర్చుతుంది

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 18: విద్య ఉన్నత శిఖరాలకు చేర్చుతుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ చదువుకోవాలని ఇంటెలిజెన్స్ విభాగం డీఎస్పీ రమణరావు అన్నారు. మిట్టూరులోని అరుణాచల జూనియర్ డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ జగన్నాథరెడ్డి అధ్యక్షతన ఆదివారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ వ్యయప్రయాసలతో చదివించే తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడం విద్యార్థుల బాధ్యతన్నారు. విద్యుత్ శాఖ విశ్రాంత ఏవో ఎర్రయ్య మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సోమలలో వీధి కుక్కల బెడద



సోమల ప్రభుత్వ వైద్యశాల వద్ద సంచరిస్తున్న వీధి కుక్కలు

సోమల, ఆగస్టు 18: సోమలలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఆదివారం స్థానిక సాయి బాబా ఆలయం వద్ద ఓ మహిళ పాలక్యాన్‌తో వెళుతుండంగా వీధికుక్కలు దాడిచేసి గాయపరిచాయి. సోమల బస్టాండ్ ప్రాంతంలో పాదచారులు, కళాశాలకు, పాఠశాలకు వెళుతున్న విద్యార్థులు కుక్కల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. నంజంపేట రోడ్డు మార్గంలో ద్విచక్ర వాహనాల్లో వెళుతున్న వారిని వెంట పడుతున్నాయి. కందూరు - సోమల రోడ్డుపై వీధి కుక్కలు గుంపులుగుంపులుగా తిరుగుతూ ద్విచక్ర వాహనదారులపై దాడులకు దిగుతున్నాయి. అలాగే పొలాల వద్ద పాకల్లో ఉండే ఆవులు, గొర్రెల మందలపై దాడులు చేస్తున్నాయి. పంచాయతీ అధికారులు నెల క్రితం కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుం టున్నట్లు దండోరా వేశారు. చర్యలు మాత్రం తీసుకోలేదని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

సారా విక్రేత అరెస్ట్

సదుం, ఆగస్టు18: మండలంలోని ఎర్రాతివారిపల్లెలో సదుం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. స్థానిక హరిజనవాడకు చెందిన కల్పన(31) వద్ద విక్రయానికి సిద్ధంగా ఉంచిన 10 లీటర్ల సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ షేక్షావలి కేసు నమోదు చేసి పీలేరు కోర్టుకు తరలించారు.

నేడు కాశీవిశ్వేశ్వరాలయంలో
పౌర్ణమి పూజలు

రామకుప్పం, ఆగస్టు 18: రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహిస్తామని వివరించారు. భక్తులకు అన్నదానం చేస్తామని తెలిపారు. భక్తులు తరలి వచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో
ఆంజనేయుడి విగ్రహప్రతిష్ఠ



నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం

సదుం, ఆగస్టు18: మండలంలోని చెరుకువారిపల్లెలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నవగ్రహ, అష్టదిక్పాలకుల హోమం, రాత్రి స్వామి వారి ఊరేగింపు చేపట్టారు. జబర్దస్త్ ఆర్టిస్టులతో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

క్రికెట్ టోర్నీ విజేత డేరింగ్‌బాయ్స్



శాంతిపురం, ఆగస్టు 18: శాంతిపురంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతగా రాళ్ళబూదుగూరుకు చెందిన డేరింగ్‌బాయ్స్ జట్టు నిలిచింది. కర్లగట్ట సింధు ఆగ్రో లిమిటెడ్ జట్టు రెండో స్థానంలో, గుండిశెట్టిపల్లె బాయ్స్ జట్టు మూడోస్థానంలో నిలిచాయి. విజేతకు, రన్నర్స్‌కు, మూడో స్థానంలో నిలిచిన వారికి టీడీపీ మండల అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఉదయ్‌కుమార్‌లు బహుమతులు, షీల్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్ర, మణి, బాలు, నాగరాజు, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మూత బడిన మినరల్ వాటర్ ప్లాంట్

సోమల, ఆగస్టు 18: సోమల మండలంలో పలు చోట్ల మినరల్ వాటర్ పంపిణీ ఆగి పోయింది. సోమల స్వయంభేశ్వరస్వామి ఆలయం వద్ద రెండు నెలలుగా వాటర్ ప్లాంట్ మూత పడింది. దీంతో స్థానికులు ప్రైవేట్ ట్యాంక్‌లను ఆశ్రయిస్తున్నారు. అలాగే నంజంపేట పంచాయతీలో రూ.2లక్షలు వ్యయం చేసి నిర్మించిన వాటర్ స్కీం ప్రారంభం జరిగినా ఇంత వరకు పంపిణీకి నోచుకోలేదు. పెద్దఉప్పరపల్లెలోని మినరల్ వాటర్ పథకం వద్ద క్యాన్‌కు రూ.10 చెల్లిస్తేనే నీటిని అందజేస్తున్నారు. రెండు నెలల వరకు ఉచితంగా అందజేసి ప్రస్తుతం రూ.10 వసూళ్ల చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బలవంతపు వసూళ్లు ఆపాలని కోరుతున్నారు.

టీటీడీలో ఫైల్స్ దగ్ధం
వైసీపీ కుట్రే : టీడీపీ

చిత్తూరు, ఆగస్టు 18: టీటీడీలో ఫైల్స్ దగ్ధం వైసీపీ నాయకుల కుట్రేనని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. ఆదివారం ఆయన పార్టీ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో ఫైల్స్ దగ్ధం కావడంపై సీబీసీఐడీ విచారణ జరిపి, దోషులను శిక్షించాలని కోరారు. హుండీ, అన్నప్రసాదాల తయారీలోనూ పలు అక్రమాలు జరిగాయని, వీటికి సంబంధించిన రికార్డులను తారుమారు చేశారని ఆరోపించారు. దీనిపైనా విచారణ జరిపించాలని కోరారు. పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకటేశ్ యాదవ్, నాయకులు విజయ్‌కుమార్, గోపాల్, యువరాజులునాయుడు, సురేష్, జయపాల్ పాల్గొన్నారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయండి



చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 18: ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్య పాఠశాలల ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు రూల్స్ అమలుకు కృషి చేయాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. విద్యాశాఖలోని అన్ని కేడర్ల టీచర్లతో పాటు జూనియర్, డైట్ లెక్చరర్లు, ఎంఈవో, డీవైఈవో తదితర పదోన్నతులు చేపట్టాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, మహిళా కన్వీనర్ పద్మ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిత్తూరు రూరల్, ఆగస్టు 18: కొంగారెడ్డిపల్లి సెక్షన్ పరిధిలోని 11 కేవీ లైన్ మరమ్మతుల కారణంగా సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. కొంగారెడ్డిపల్లి, పుత్తూరు రోడ్డు, మురగానిపల్లి, సీకే పల్లి, బీవీ రెడ్డి కాలనీ, లక్ష్మీనగర్ కాలనీ, కట్టమంచి తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

అలరించిన జానపద గీతాలాపన


గీతాలాపన చేస్తున్న కళాకారులు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 18: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మన సంస్కృతి జానపద గీతాలాపన కార్యక్రమం ఆకట్టుకుంది. ప్రముఖ జానపద కళాకారుడు కలకట రెడ్డెప్ప ఆధ్వర్యంలో విభిన్న రకాల జానపద కళాకారులు తమ కళా నైపుణ్యంతో అలరించారు. కళాకారులను సంస్థ నిర్వాహకులు ఆర్.సహదేవనాయుడు సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, ఎం.శెట్టి, శంకరప్ప, కె.రాజు, గుణశేర్, నాగరాజు, మనోహర్ పాల్గొన్నారు.

రాఖీలకు భలే డిమాండ్

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 18: నగరంలో రాఖీలకు భలే డిమాండ్ ఏర్పడింది. సోమవారం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం రాఖీల కొనుగోలుకు జనం ఎగబడ్డారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా రాఖీ పండగ నిర్వహించడం హిందూ సంప్రదాయం. నగరంలోని కోదండరామాలయం, పొన్నియమ్మ గుడి వీరాంజనేయ, దుర్గాంబ, అగస్తీశ్వర, కట్టమంచి వరదరాజ, కులందేశ్వర, సంతపేట రంగనాథ ఆలయాల్లో జంధ్యాల(యజ్ఞోపవీతం) పండగ నిర్వహించనున్నారు.

శక్తి నాగాలమ్మ ఆలయ వార్షికోత్సవం



చిత్తూరు కల్చరల్, ఆగస్టు 18: నగరంలోని మురకంబట్టు బైపాస్ రోడ్డులో వెలసిన శక్తి నాగాలమ్మ ఆలయ వార్షికోత్సవ పూజలు ఆదివారం అత్యంత వైభవంగా జరిగాయి. అమ్మవారికి 108 శంఖాలతో జలాభిషేకం, కలశపూజ, గణపతి హోమం నిర్వహించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. పుష్పాలంకరణతో భక్తులకు దర్శనం కల్పించారు. తీర్థ ప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేశారు.

వీల్‌చైర్ వితరణ



వెదురుకుప్పం, ఆగస్టు 18: ఆరేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి బెడ్డుకే పరిమితమైన గొడుగుచింతకు చెందిన సుబ్రహ్మణ్యం రెడ్డికి జనసేన పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యుగంధర్ ఆదివారం వీల్‌చైర్ అందించారు. పార్టీ నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ యతీశ్వర్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బెనర్జీ, నాయకులు మునిరత్నంశెట్టి, విజయ్, సురేష్‌రెడ్డి, అన్నామలై పాల్గొన్నారు.

సహకార సంఘ ఓటర్లు ఈకేవైసీ చేసుకోండి

విజయపురం, ఆగస్టు 18: సహకార సంఘంలో ఓటర్లుగా ఉన్న రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని అగరం రామకృష్ణ సహకార సంఘం సీఈవో సుబ్రహ్మణ్యం కోరారు. ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ఈకేవైసీ తప్పనిసరి అని పేర్కొన్నారు. ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఫోన్ నంబర్, నామిని వివరాలను మూడు రోజుల్లో అందించాలని సూచించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


కంటి ఆపరేషన్‌కు ఎంపికైన రోగులు

విజయపురం, ఆగస్టు 18: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో వికలాంగుల సేవా సంస్థ వారు ఆదివారం తిరుపతి సురేంద్ర ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 75 మందికి పరీక్షలు నిర్వహించి, 15 మందిని ఆపరేషన్‌కు సిఫారసు చేశారు.

టీటీడీలో ఫైల్స్ దగ్ధం వైసీపీ కుట్రే : టీడీపీ

చిత్తూరు, ఆగస్టు 18: టీటీడీలో ఫైల్స్ దగ్ధం వైసీపీ నాయకుల కుట్రేనని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. ఆదివారం ఆయన పార్టీ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలో ఫైల్స్ దగ్ధం కావడంపై సీబీసీఐడీ విచారణ జరిపి, దోషులను శిక్షించాలని కోరారు. హుండీ, అన్నప్రసాదాల తయారీలోనూ పలు అక్రమాలు జరిగాయని, వీటికి సంబంధించిన రికార్డులను తారుమారు చేశారని ఆరోపించారు. దీనిపైనా విచారణ జరిపించాలని కోరారు. పార్టీ బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకటేశ్ యాదవ్, నాయకులు విజయ్‌కుమార్, గోపాల్, యువరాజులునాయుడు, సురేష్, జయపాల్ పాల్గొన్నారు.

ఎస్పీకి రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు



చిత్తూరు, ఆగస్టు 18: రక్షాబంధన్‌ను పురస్కరించుకుని ఆదివారం పలువురు బ్రహ్మకుమారీలు ఎస్పీ మణికంఠకు రాఖీకట్టి సోదర ప్రేమను చాటుకున్నారు. బ్రహ్మకుమారి సిస్టర్ జ్యోతి ఆధ్వర్యంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి రాఖీకట్టి, మిఠాయి తినిపించారు. ఎస్పీ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన



చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 18: శంకర్ కంటి ఆస్పత్రి బెంగళూరు సౌజన్యంలో ఆదివారం స్థానిక రాంనగర్ కాలనీలోని హార్వర్డ్ స్కూల్లో కరస్పాండెంట్ భాస్కర్, డైరెక్టర్ త్రివేణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జిల్లా కంటి అంధత్వ సొసైటీ జిల్లా ప్రోగ్రామింగ్ మేనేజర్ డాక్టర్ అర్పిత, నగర మాజీ మేయర్ కఠారి హేమలత ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. డాక్టర్ విరంగి దోషి 300 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 42 మందిని ఉచిత కంటి ఆపరేషన్లకు ఎంపిక చేశారు. డివిజన్ ఇన్‌చార్జి కోలా కిరణ్, పీఆర్వో శివప్రకాష్, కోఆర్డినేటర్ లక్ష్మీపతి పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

నేటి నుంచి రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 18: గిరింపేట సుగుణేంద్ర తీర్థ మూల సన్నిధానంలోని మంత్రాలయ రాఘవేంద్ర స్వామి 353 ఆరాధనోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. మంగళవారం పూర్వారాధన, బుధవారం మధ్యారాధన, గురువారం ఉత్తరాధనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. నగరంలోని జెండావీధి భీమారావు సత్రం, రాఘవేంద్ర స్వామి ఆలయంలో నూ ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వివేకంతో జ్ఞానాన్ని సముపార్జించాలి


గీతా జ్ఞానాన్ని బోధిస్తున్న శ్రేయానంద సరస్వతి

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 18: వివేకంతో జ్ఞానాన్ని సముపార్జిస్తే అనుకున్న లక్ష్యాలను సాధించి, సమాజంలో ఆదర్శ వంతులుగా మిగులుతారని ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకురాలు శ్రేయానంద సరస్వతి చిన్మాయానంద ఉద్ఘాటించారు. నగరంలోని వేలూరు రోడ్డు సద్గురు సేవాశ్రమంలో ఆదివారం ఆమె గీతాజ్ఞాన యజ్ఞం ఉపన్యాసాలను ప్రారంభించారు. ఈనెల 24 వరకు ఉదయం, సాయంత్రం ఉపన్యాసాలు ఉంటాయని సద్గురు ఆశ్రమ ప్రధాన నిర్వాహకులు పరబ్రహ్మ స్వామిజీ తెలిపారు.

20 మందికి కంటి ఆపరేషన్లు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 18: సద్గురు సేవాశ్రమంలో అమ్మాట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 11న నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో ఎంపికైన 20 మందికి బెంగళూరు శంకర నేత్ర వైద్యశాలలో ఆపరేషన్లు నిర్వహించినట్లు ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ప్రతి ఆదివారమూ ఆశ్రమంలో నిర్వహించే కంటి వైద్య శిబిరాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీవిత సాఫల్య పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కల్చరల్ , ఆగస్టు 18: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత సాఫల్య పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ నిర్వాహకురాలు సరోజమ్మ కోరారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ సామాజిక, సాంస్కృతిక రంగాల్లో గుర్తింపు పొందిన వారికి సెప్టెంబరు 5న తిరుపతిలో జరిగే ఉపాధ్యాయ దినోత్సంలో పురస్కారాలు అందజేయనున్నట్లు వివరించారు. వైద్య, విజ్ఞాన, సాంస్కృతిక రంగాల్లో నిష్ణాతులు కూడా అర్హులేనని తెలిపారు. ఈనెల 28లోపు 6302908528, 9705313061, 9440225924 లకు వాట్సాప్‌లో వివరాలు అందజేయాలని పేర్కొన్నారు.

హత్యాచార నిందితులను శిక్షించాలి


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నేతలు

వెదురుకుప్పం, ఆగస్టు 18: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్ హత్యాచారం కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదివారం రాత్రి కార్వేటినగరంలో రాజకీయ నాయకులు కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

విద్య ఉన్నత శిఖరాలకు చేర్చుతుంది



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న రమణరావు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 18: విద్య ఉన్నత శిఖరాలకు చేర్చుతుందని, కాబట్టి ప్రతి ఒక్కరూ చదువుకోవాలని ఇంటెలిజెన్స్ విభాగం డీఎస్పీ రమణరావు అన్నారు. మిట్టూరులోని అరుణాచల జూనియర్ డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ జగన్నాథరెడ్డి అధ్యక్షతన ఆదివారం ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ వ్యయప్రయాసలతో చదివించే తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడం విద్యార్థుల బాధ్యతన్నారు. విద్యుత్ శాఖ విశ్రాంత ఏవో ఎర్రయ్య మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటే అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సింగిల్‌విండోల డిజిటలైజేషన్‌కు సహకరించాలి

గంగాధరనెల్లూరు, ఆగస్టు 18: సింగిల్ విండోల డిజిటలైజేషన్‌కు రైతులు తోడ్పడాలని డీసీసీబీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ మంగపట్నం మహేష్, సీఈవో విజయకుమార్‌రెడ్డి కోరారు. అక్టోబర్ 2వ తేదీలోపు భూమి పాసుబుక్, ఆధార్ కార్డు, మొబైల్ నంబర్, రేషన్‌కార్డుల జిరాక్స్‌లతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను సింగిల్‌విండో కార్యాలయంలో అందజేయాలని కోరారు.

వానొస్తే వాహనదారుల అవస్థలు చూడతరమా..!

దుస్థితిలో రహదారులు



వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లె సమీపంలో, కమ్మకండ్రిగ వద్ద బావులను తలపిస్తున్న గుంతలు

వెదురుకుప్పం, ఆగస్టు 18: మండలంలో పలు రోడ్లు దుస్థితిలో ఉన్నాయి. గుంతలమయంగా మారాయి. వానొస్తే ఆ గుంతల్లో నీరు చేరి వాహనదారులకు నరకం చూపిస్తున్నాయి. మొండివెంగనపల్లె, బలిజమొండివెంగనపల్లె, బ్రాహ్మణపల్లె, కమ్మకండ్రిగ ప్రాంతాల వద్ద పరిస్థితి దారుణంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. బ్రాహ్మణపల్లె నుంచి కురివికుప్పంకు వెళ్లే రహదారి పూర్తిగా దెబ్బతినడం వల్ల వాహనదారుల ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోయింది. నల్లవెంగనపల్లె క్రాస్ రోడ్డు నుంచి కలిమిచేనుకు వెళ్లే మార్గమూ ప్రమాదకరంగానే ఉంది. నల్లవెంగనపల్లె నుంచి చింతలగుంట మార్గంలో వెళ్లే రోడ్డు పాడైపోయింది. జక్కిదొన క్రాస్ రోడ్డు నుంచి మొరవకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారై రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తోంది. దేవరగుడిపల్లె క్రాస్ రోడ్డు నుంచి అడపారెడ్డిపల్లెకు వెళ్లే రహదారి గుంతలమమైంది. రెడ్డేపల్లి క్రాస్ నుంచి జాండ్లపేట రోడ్డు అధ్వానంగా ఉండటంతో ఆ మార్గంలో బైకుల్లో వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి. దేవళంపేట ఇండియన్ బ్యాంకు ముందు వెదురుకుప్పం-చిత్తూరు రహదారిలో గుంత చెరువును తలపిస్తోంది. ఇలా మండల పరిధిలో గ్రామీణ రోడ్లతో పాటు ఆర్‌అండ్‌బీ రోడ్లు మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహన చోదకులకు తిప్పలు తప్పడం లేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో 4,721 కి.మీ రోడ్ల మరమ్మతులు, నిర్మాణం చేపట్టాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలెక్టర్ల సమావేశంలో చెప్పడంతో మండల ప్రజలు కూడా తమ రోడ్లు బాగుపడతాయని ఆశగా ఎదురుచూస్తున్నారు.

జీవో 117 రద్దుకు కృషి చేయాలి



రాష్ట్ర నేతలకు వినతిపత్రమిస్తున్న జిల్లా నాయకులు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 18 : విద్యా వ్యవస్థకు నష్టం చేకూర్చుతున్న జీవో 117ను రద్దు చేసే విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్ మోహన్, మోహన్ యాదవ్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ కోరారు. ఈ మేరకు ఆదివారం విజయవాడలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్, రఘునాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసిం హారెడ్డిలను కలిసి వినతిపత్రం అందజేశారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలు, తుది చెల్లింపులు, 12వ పీఆర్సీ మధ్యంతర భృతి, ఉమ్మడి సర్వీసు రూల్స్ రేషనలైజేషన్ అమలుకు చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి


ప్రమోద్ (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, ఆగస్టు 18: మండలంలోని అప్పిరెడ్డికండ్రిగ బస్టాప్‌కు సమీపంలో ఈ నెల 12వ తేదీ జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు ఆదివారం మృతిచెందాడు. వ్యాన్‌ను కారు ఢీకొన్న ఘటనలో శ్రీరంగరాజుపురం మండలం కొత్తపల్లెమిట్టకు చెందిన హర్షవర్ధన్‌రెడ్డి, ప్రమోద్, ఆకాష్‌లు గాయపడిన విషయం విదితమే. వారిని తమిళనాడు రాణిపేట ఆస్పత్రికి తరలించగా 13వ తేదీ హర్షవర్ధన్‌రెడ్డి మృతిచెందాడు. ప్రమోద్, ఆకాష్‌లు అక్కడే చికిత్స పొందుతున్నారు. ప్రమోద్ పరిస్థితి సరిగాలేకపోవడంతో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి ముత్తిరేవుల ఆర్‌వీఎస్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. తిరుపతికి తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు చెప్పడంతో అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గంమధ్యలోనే మృతిచెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు కొత్తపల్లెమిట్టకు వచ్చి నివాళి అర్పించారు.

రమణీయం లక్ష్మీనారాయణుల కల్యాణం


ఉభయదారులకు చిత్రపటం అందజేస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 18: వేపంజేరి లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాతసేవతో మేల్కొలిపి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేతుడైన ఏడుకొండలరాయుడిని పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి, కల్యాణోత్సవం నిర్వహించారు. తమిళనాడు రత్నగిరికి చెందిన శేషాచారి, చెన్నైకి చెందిన లోకనాథ్‌గుప్తా, తిరుపతికి చెందిన జయంతి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. వారిని సన్మానించి, స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ భాగవతార్ రామకృష్ణారెడ్డి హరికథా కాలక్షేపం చేశారు. ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి పాల్గొన్నారు.

సారా తయారీ స్థావరాలపై దాడులు


స్వాధీనం చేసుకున్న సారా డ్రమ్ములతో పోలీసులు

వెదురుకుప్పం, ఆగస్టు 18: కార్వేటినగరం సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో వెదురుకుప్పం పోలీసులు ఆదివారం సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. పచ్చికాపల్లం పంచాయతీ చిన్ననక్కలాంపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో దాడులు చేసి, 175 లీటర్ల సారా, తయారీకి ఉపయోగించే 200 లీటర్ల స్పిరిట్ స్వాధీనం చేసుకున్నారు. 20 ప్లాస్టిక్ డ్రమ్ములు, ఆరు ఐరన్ డ్రమ్ములు, ఐదు స్టీల్ బిందెలు, నాలుగు అల్యూమినియం పాత్రలు, ఐదు ప్లాస్టిక్ బిందెలు స్వాధీనం చేసుకున్నారు. నాలుగు వేల లీటర్ల బెల్లం ఊట, చెక్కను నాశనం చేశామని పోలీసులు తెలిపారు.

వైభవంగా పడవేటమ్మ తిరునాళ్ల


విజయపురం మండలం ఎల్లసముద్రం ఎస్టీ కాలనీ వాసులతో ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం/నగరి/నింద్ర, ఆగస్టు 18: మండలంలోని ఎల్లసముద్రం ఎస్టీ కాలనీలో ఆదివారం పడవేటమ్మ తిరుణాళ్ల వైభవంగా నిర్వహించారు. వీధులను వేప తోరణా లు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం అమ్మవారికి అంబలి పోసి, మొక్కులు తీర్చుకున్నారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అమ్మ వారిని దర్శించుకున్నారు. కాగా, అంతకు ముందు ఎమ్మెల్యే నగరి సత్రవాడలో ద్రౌపదీసమేత ధర్మరాజుల తిరునాళ్లలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. నింద్ర మండలం అగరం గ్రామ దేవత చెల్లేతమ్మను దర్శించుకున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెడతాం

గుడిపాల, ఆగస్టు 18: మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతామని ఎస్ఐ రామ్మోహన్ అన్నారు. ఆదివారం రాసనపల్లె చుట్టుపక్కల ప్రాంతాల్లోని సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. 400 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు. ఆయన మాట్లాడుతూ సారా, మద్యం అమ్మినా, పేకాట ఆడినా, ఇసుక అక్రమ రవాణా చేసినా, గంజాయి తాగినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఏకీకృత సర్వీస్ రూల్స్ అమలు చేయండి


పురందేశ్వరికి వినతిపత్రం ఇస్తున్న ఆపస్ నాయకులు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 18: ప్రభుత్వ, జెడ్పీ యాజమాన్య పాఠశాలల ఉపాధ్యాయులకు ఏకీకృత సర్వీసు రూల్స్ అమలుకు కృషి చేయాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ ఆదివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. విద్యాశాఖలోని అన్ని కేడర్ల టీచర్లతో పాటు జూనియర్, డైట్ లెక్చరర్లు, ఎంఈవో, డీవైఈవో తదితర పదోన్నతులు చేపట్టాలన్నారు. వినతిపత్రం అందించిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, మహిళా కన్వీనర్ పద్మ ఉన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

శ్రీరంగరాజపురం, ఆగస్టు 18: యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఎస్ఆర్‌పురం మండలం యూఎం పురం గ్రామానికి చెందిన శంకర్ పుల్లూరు క్రాస్ రోడ్డులో పాత సామాన్ల అంగడి నడుపుతున్నాడు. అదే గ్రామానికి చెందిన కిశోర్ వ్యవసాయ పొలాల వద్ద చోరీ చేసిన ఇనుప సామాన్లు, పైపులు, యాంగిల్ వైర్లు తీసుకొచ్చాడు. వాటిని శంకర్ తీసుకుని రూ.1,400 ఇచ్చాడు. తన పొలంలో చోరీకి గురైన వైర్లు శంకర్ అంగట్లో ఉన్నాయని తెలుసుకుని ఢిల్లీ అనే రైతు వచ్చి వాటిని తీసుకెళ్లాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి పుల్లూరు క్రాస్ రోడ్డులోని మద్యం షాపు వద్ద ఉన్న కిశోర్‌కు ఈ విషయం చెప్పి డబ్బు తిరిగి ఇవ్వాలని శంకర్ కోరాడు. వెంట తెచ్చుకున్న కత్తితో శంకర్‌పై కిశోర్ దాడి చేశాడు. గాయపడిన శంకర్‌ని 108లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కిశోర్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు కార్వేటినగరం సీఐ హనుమంతప్ప తెలిపారు.


బాలికపై వానరం దాడి

పుంగనూరు రూరల్, ఆగస్టు18: బాలికపై వానరం దాడి చేసి గాయపరిచిన సంఘటన రెండు రోజుల క్రితం పుంగనూరు మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని సింగిరిగుంట పంచాయతీ మార్లపల్లెకు చెందిన వంశీకృష్ణ కుమార్తె మోక్షిత(9) గ్రామంలోనే 3వ తరగతి చదువుతోంది. గ్రామంలోని చిల్లర దుకాణంలో తినుబండారాలు తీసుకెళుతుండగా కోతి దాడి చేసి చేతిపై గాయపరించింది. పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్సలు అందిస్తున్నారు.

ఎద్దుల పరుగు పందేలు పలువురికి గాయాలు

కుప్పం, ఆగస్టు 18: కుప్పం మండలంలోని చెక్కునత్తం గ్రామంలో ఆదివారం ఎద్దుల పరుగు పందేలు నిర్వహించారు. ఆంధ్రా నుంచే కాక, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి కూడా పందెపుటెద్దులను తీసుకొచ్చిన యువకులు పందేలలో పాల్గొన్నారు. స్థానికుల యువకుల ఆధ్వర్యంలో బ్యారికేడ్లను ఏర్పాటు చేసి ఎద్దులను పరుగు పెట్టించారు. పలువురు యువకులు బ్యారికేడ్లను దాటుకుని వచ్చి ఎద్దులను పట్టుకోబోయారు. పలువురు అదుపుతప్పి కిందపడ్డారు. ఎద్దులతోపాటు బరిలో చాలా దూరం నేలమీద పడి జారారు. పలువురికి రక్తగాయాలయ్యాయి.

కవులకు ఘన సన్మానం



పుంగనూరు, ఆగస్టు 18: పుంగనూరు కవులను బెంగళూరులోని ఇండోయేషియన్ అకాడమీ వారు సన్మానించారు. ఆదివారం బెంగళూరులో జరిగిన కవి సమ్మేళనంలో పుంగనూరు చెందిన కవులైన స్రవంతి, గాయత్రిదేవి, రహత్‌జాన్, హసినాబేగంలను మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లె రాధాకృష్ణన్ మనవడు సుబ్రహ్మణ్యశర్మ, అకాడమీ ప్రొఫెసర్ ఏకాంబరం ఘనంగా సన్మానించారు.




కృష్ణాజిమ్మాపురంలో గోడలకే పరిమితమైన సచివాలయ భవనం - పునాదులకే పరిమితమైన వెల్‌నెస్ సెంటర్ - అసంపూర్తిగా ఆర్బీకే భవనం

ప్రభుత్వ భవనాలకు మోక్షం లభించేనా?

పాలసముద్రం, ఆగస్టు 18: మండలంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు ప్రభుత్వ భవనాల నిర్మాణం అసంపూర్తిగా ఉండిపోయింది. కృష్ణజిమ్మాపురంలో సచివాలయాల భవన నిర్మాణం పూర్తి కాలేదు. మొదటి అంతస్తు స్లాబ్‌వేసి, రెండో అంతస్తు నిర్మాణానికి గోడలు కట్టి వదిలేశారు. వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రాలను నిర్మించేందుకు గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వీటి నిర్మాణాలను వైసీపీ నేతలకు నామినేషన్ పద్ధతిపై ప్రభుత్వం కట్టబెట్టింది. భవన నిర్మాణాలు చేపట్టిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో మధ్యలోనే నిలిపేశారు. వెల్‌నెస్ సెంటర్ పునాదులకే పరిమితమైంది. ఆర్బీకే భవనం లోపల గోడలకు పూతపని, ఫ్లోరింగ్, తలుపులు, కిటికీలు, విద్యుత్ పనులు చేయకుండా ఆపేశారు. ప్రస్తుతం ఈ భవనాలు దుస్థితికి చేరుకుంటున్నాయి. మరో వైపు భవన వసతి లేకపోవడంతో పంచాయతీ కార్యాలయంలోని చిన్న గదిలో సచివాలయ సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయ సేవలు అందక రైతులు కూడా ఇబ్బంది పడుతున్నారు. కొత్తగా వచ్చిన కూటమి ప్రభుత్వమైనా వీటిపై దృష్టి సారించి, త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.